# ఎర్రసీమలదారి

"అగ్నికణం"

తెల్లోల్ల సేతుల్నుంచి నల్లోల్ల సేతుల్ల దోపిడి పడకముందు యిప్పుడున్న పెబుత్తంలా నిజాం వుకుం జబర్దస్తి సాగే రోజుల్లో కూలిబతుకులు బతికినా దొరల తమదివాన్లో యెట్టి సేయిత్తన్నపుడు మున్నూటరవైదినాలు పనిసేత్తే జీతంరాల్లు మిత్తికి నాగులకి పోగా దొరల తిట్లు దీవెనలతో కడుపులు నింపుకుంటున్నరోజుల్ల యింట్ల దానికి పొయ్యే పానం వచ్చేపానం తెల్వటల్లా. గందుకె దొరదగ్గర మా అయ్యకొన్న రెండెకరాల్లో యకరం ఉల్లినర్సయ్య బిల్లిపెట్టెలో ఇరికించాల్సొచ్చింది. నిజానికాపెట్టెకి పానం లేకపోయినా మా వూరోల్ల రకితమాంసాలు తినిబలిసి కాంకిరీటు అరల్లోకి పత (అడ్రిస్) మారుసుకుంది.

పత మారినప్పట్నుంచే ఆకలిపెరిగి పక్క వూల్లమీదపడి తెగతిని బలిసిపోతన్నది. వూల్లల్లో వాల్లు 'పెరగటం యిరగటాని'కంటంటె యిరిగివియన్ని తిని అరగించుకొని తెగపెరిగి పోతన్నాది. పెరిగిపోతన్న ఆ పెట్టెలోని నా యకరం అరక్కముందె తిరిగి తీసుకుందమని అరికవతంలనె పనిక్కదిరా.

తెల్లోడు పొయ్యి నల్లోడొచ్చాడన్నారు. బత్తీ బాబులు ఓట్లని సీట్లని తిరణాల కుక్కల్లా తిరిగిన్రు. నాటుసారా వాటంగా పోయించిన్రు. ఊగించిన్రు. కొట్లాటలు పెట్టిన్రు. కేసుల్ల యిరికించిన్రు. కోరుట్ల సుట్టు తిప్పిన్రు. పారిటీలన్నరు. అల్లి పబ్బాలు గడుపుతున్నరు. పొట్టలు నింపుకున్రు. ఒడ్డున కూకున్రు.

గట్ల ఓట్ల తిరిపాలకి మున్మూరు తిరిగిన్రు. సోషలిజ మన్నరు. దున్నేవానికి బూమన్నరు. తిన్నోడివి తినబెట్టిన్రు. తిననోడివి పెట్టిందాకా ఆగమన్నరు.

ఈ పెబుత్తం వచ్చినాక పుట్టినోడిక్కాడ ఓటిచ్చికూకుంది కాని దున్నేవానికి మాత్తరం బూమిరాలా. గట్టిగ బూమికావాలనోల్లిందర్ని పెబుత్తం సొంతకరుసుల్తో రాజమండ్రి యెట్టిగదుల్లో కంపించింది.

పాతికేల్లు కవతంల పనిజేసినా ఉల్లినర్సయ్య కివ్వాల్సినబాకి ఉల్లిపొట్టంతైనా తీర్లా. తీరతందన్న ఆశ చుట్టుపక్కల వూల్లోల్ల కెవ్వరికిలేదు. నాకెట్టాగ వుంటది. యాడాది కల్లా మిత్తి అసలికి మించి పోతాంటె యెట్టా తీరుద్దాని బోయిదిగావుంది. ఇంత జాగు సేత్తె పొలం ఇల్లుగూడ పోద్దని యకరంతో సరిపెట్టుకోమని కాల్లెల్లబడి బతిమాలుకున్న.

899

గామాటకు పరెవన్నడు ఉల్లివర్పయ్య. గప్పట్నుంచి సాగరోల్లవన్లజేరి రేయనక పగులనక కట్టపడి పనిసేత్తన్న. కాలవలయినంక నసీబు మారుద్ధనుకుంటి. ఉన్నయకరం పెద్దకాలవబడి తమాం మునిగిన ఇంగ జాస్క నా కట్టాలు. దొరల కవతంల ఉన్నపుడిద్దరం ఉల్లోల్ల కవతంల కొచ్చెపాటికి నలుగురం. ఇప్పుడారుగురు మైనం. రోగాలు రొట్టూ ఎక్కువైపోనాయి గుడిసెమీది కప్పు ఎగిసిపోనాది.

గూడూ గుడ్డా లేకపోతేమానె కాయకట్టంసేసెటోల్ల పేక్కంత గంజికూడ దొరకటంల సోమారం శనోరం ఒకపూట అన్నం మానుకోమని రేడియాలంటంటె ఆ రోజుల్లోనె ఒకపూట గటకతాగె మాలాటోల్లేం జేయాల్నో తెలియటల్లా

సిన్నోడు పాలబొక్క పోయిండు. రోగాల్తో మరీ యండకపోతండు. పెబుత్తం ఆసుపత్రికిపోతె డాకసరి మందుల్లెవ్వండు, నా పిల్లడ్ని బతికిత్తడని అడనె పానసారం బదుంటె ఆండ్ల మందులున్నయొ లెవ్వొ తెల్దుగాని డబ్బులు మాత్తరం డాకసరిబాబు తెమ్మండు. డబ్బుల్కోసం రోజల్లి రెక్కలుముక్కల్సేసక పనిసేత్తే ముట్టియాపాయిచ్చి తోలిండు పెద్దరెడ్డిగారు. నా కొడుకు బతుకుతుడుగందాని ఆసుపత్తిరికి సేరెపాటికి ఆనికి నూరేల్లు నిండుకున్నయి. అయిన నా యెర్రిగాని డాకసర్లు నరుసులమ్మలున్నా కుక్కలు పిల్లల్నీడసక పోతాంటె నా కొడుకేడబతుకుతడు.

పెద్దదానికి పాతికేల్లొచ్చినా పెల్లి సెయ్యాలా తిండే పెట్టలేకపత్తుంటె పెల్లేడసేద్దు. వొయిసొచ్చిందానికి పెల్లికాక గుడ్డల్లేక అవసరాలు గడవక పక్కింటోడితో లేసిపోనాది దాని తప్పేవుంది, తప్పంతా నాది. అయినోల్లు ఎలేత్తె ఇంట్ల ఉండలేక బయటికెల్లలేక తలెత్తి తిరగలేక సతమతమయిపోతన్న.

పెద్దరెడ్డిగారి సెలక్కి కూలికిపోతె పెద్దబ్బాయిగోరి సూపులకి రాందోది సినిగిన గుడ్డల్లో వొల్లు కనపడకుండ దాసుకోవాలని యమ యాతన పడతాంటె కడుపులో దేవినట్టు కత్తుల్తో పొడిసినట్టుగుండాది. సందకాడ సినిగిన గుడ్డలు మరీ పేలికలై రకతపు సుక్కల్తో యింటికొచ్చిన నా బిడ్డని సూసికూడ ఏంసేలేకపోనా.

మూడోవాడు బజార్లపొంటి తిరిగి ఉన్నోల్ల పిల్లలాగ అన్నీ కావాలని యాగీ సేత్తంటే కొనిపెట్టలేక గంజి పోయలేక కసురుకుంట అడది బాత్తంటె వొద్దనలేక ఆ తప్పోరిదో తెలిసీ ఊరుకున్న నా పీక మలుముతున్నట్టనిపించింది. ఏంసేయాల? ఏం సేయగల్ను? పిల్లలకు పెట్టలేక పస్తులుంచలేక కడుపు కోతగావుండి ఎండ్లన్నపడి సావాలనుకున్న కాని అంతపని సేలేకపోయ్న.

900

అంతల కాలవల్లి పొయ్యి పొలాలోల్లకి దబ్బిత్తరని సెప్పినురి ఆపీసర్లంట. కార్లల్ల వచ్చినురి. అల్లొత్తె అల్ల కాల్లి యాల్లిబడితి, రేపంట్రి మాపంట్రి రూపాయకి పావలా లంటిరి. యేం జేద్దు. సరెనంటి. తీర నాపేరుసూత్తె అండ్ల కనబడదాయె. కాయితాలన్ని తిరగేసిసూసి మరీ సెప్పినురి. పటవారికి గిరదావోరికి యియ్యాల్సిందిత్త నని తీర తెల్సుకుంటె మా తాత అయాంల కొన్న పొలం దొరోరిపేర ఉందట. అయనకే దబ్బిచ్చినరింట.

ఈ బాదలన్నిటికి తట్టుకోలేక ఎండ్లన్నపడి సావాలనుకున్న. నే సత్తె ఉన్నోల్లి బాదలు తగ్గవాయె. ఏమైనసరె అందరికి యిసమిచ్చి సావాలనుకుంటె ఏంలాబం? సచ్చి సాదిచ్చేదేం లేదనుకున్న. ఇదంత సూసినంక పావం కలుక్కుమంది. ఇన్నాల్లు పేసిన ఊడిగం మనసు ఓరుపును నంపి, తూరుపు సూసి దొరోరి కవతంల ఉల్లోరి కవతంల కందికోసిన కొడవలికి పదును పెట్టమంది. పదునుమీద పదునెట్టి ఉల్లోరింట్ల దొరోరింట్ల పీకలమీదే బేసిన.

శ్రీకాకుళంల యర్రసీమలు పాముల్ని తిని బాగా బతుకుతున్నయి. ఆ దారంట బోతున్న. అంతకన్న ఏదారిబాగోదు. అదే ఎర్రసీమలదారి.

## విరసం నాటికలు

లోగా విరసం నాటికలు–నాటకాలు ప్రచురించాలని నిర్ణయించుకొని ప్రకటించిన మేరకు వచ్చిన నాటికల్లో, నాటకాల్లో గంగిరెడ్డిగారి నాటకం 'నాంది' ఉత్తమమయిందిగా భావించి ప్రచురించనయినది. ఇంకా రచయితల నుంచి విరసం ఆశయాలకు అనుగుణమైన నాటికలు, నాటకాలు ముఖ్యంగా ప్రదర్శన యోగ్యంగా వుండేట్లుగా రాసి పంపించవలసిందిగా కోరుతున్నాం. నాటకాలు, నాటికలు నేరుగా రాచకొండ విశ్వనాథశాస్త్రి, మహారాణిపేట, విశాఖపట్నంకు పంపించవచ్చును.